క్లుప్తంగా

నేటి నుంచి వేసవి శిక్షణా శిబిరాలు

చాపాడు: స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేది వరకూ వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి జే.శివశంకర్ రెడ్డి తెలిపారు. ఈ శిబిరాలలో స్పోకెన్ ఇంగ్లీషు, కథలు, పద్యాలు, పుస్తకాలు చదువడం, సంగీతం, పద్యాలు, పాటలు, లెక్కలు, జనరల్ నాలెడ్జీ వంటి వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాలను చాపాడు గ్రంథాలయ పరిధిలోని విద్యార్థులందరూ వినియోగించుకోవాలని గ్రంథాలయ అధికారి కోరారు.

రేపు ఉద్యాన సమ్మేళనం

పోరుమామిళ్ల: కడప టౌన్ రాయచోటి రోడ్డులోని మాధవి కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం ఉద్యాన సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, ఉద్యాన శాస్త్రవేత్తలచే పంటల సాగుపై ప్రసంగాలు, వివిధ నిష్ణాతులపై సమాలోచనలు, ఆధునిక సాంకేతికపై ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉద్యాన రంగంలో నూతన సాంకేతికత, రైతులు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాతావరణ మార్పులు, మార్కెటింగ్ అవకాశాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. ఈ సమ్మేళనంలో రైతులు పాల్గొన్ని జయప్రదం చేయాలని కోరారు.

వైభవంగా పోలేరమ్మ జాతర



పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని త్యాగరాజకాలనీలో పోలేరమ్మ ఆలయంలో జాతర సందర్భంగా ఆదివారం నిర్వహించిన బోనాల కార్యక్రమం వైభవంగా జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పోలేరమ్మతల్లికి బోనాలు సమర్పించి తమ మొక్కులను చెల్లించుకున్నారు. గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో విరసిల్లాలని కోరుతూ పోలేరమ్మతల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ఆవరణలో బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నం వడ్డిస్తున్న శ్రీనివాసుల స్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోలు బంకు సమీపంలో ఆదివారం అమావాస్య సందర్భంగా కాలభైరవస్వామి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. కాలభైరవస్వామి చిత్రపటానికి, విగ్రహానికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి పూలతో అలంకరించారు. వేకువజామున రామేశ్వరంలోని కాలభైరవస్వామికి విశేష పూజలు చేశారు. కాలభైరవస్వామి ఉపాసకులు శ్రీనివాసుల స్వామి ఆధ్వర్యంలో 400 మంది పైగా భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పెద్ద మల్లిఖార్జున, చరణ్, సంతోష్,శివ, సాయి, సురేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ చల్ల ఉత్సవం



మోడంపల్లె పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద చల్ల కుండలతో భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మోడంపల్లెలో ఆదివారం పెద్దమ్మ తల్లికి ఘనంగా చల్ల మహోత్సవాన్ని భక్తులు నిర్వహించారు. భక్తులు కుండలలో అమ్మవారికి చల్లను తీసుకుని ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపుగా టీచర్స్ కాలనీ సమీపం వరకు తీసుకెళ్లారు. అనంతరం భక్తులకు పంపిణీ చేశారు. కాగా వచ్చే ఆదివారం పెద్దమ్మతల్లి దేవర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు.

బాధితులను ఆదుకోవాలి



నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ప్రభుత్వం కేవలం రూ. పది లక్షలు మాత్రమే ప్రకటించడం బాధాకరమని, ఒక్కొక్కరికి కోటి రూపాయలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేశంలో ముస్లింలు ప్రభుత్వానికి అండగా నిలబడ్డం, మద్దతు ప్రకటించడం, హర్షణీయమన్నారు. తీవ్రవాదులకు శిక్షణ ఇచ్చి మన దేశాన్ని అల్లకల్లోలం చేయాలని ప్రయత్నిస్తున్న పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని నాగార్జునరెడ్డి కోరారు.

'నిర్మాణం' పెనుభారం

- భారీగా పెరిగిన ఇంటి నిర్మాణ వ్యయం
- భగ్గుమంటున్న సిమెంట్, స్టీల్ ధరలు
- బెంబేలెత్తుతున్న సామాన్యులు



అట్లూరు: ప్రతీ సామాన్యుడు జీవితంలో సొంతింటి కోసం కలలు కంటాడు. అందుకు పైసా పైసా కూడబెట్టి తనకంటూ ఒక గూడును నిర్మించుకోవాలని ప్రతినిత్యం కష్టపడుతుంటాడు. కానీ ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో మధ్య తరగతివారు సొంత ఇల్లు నిర్మించుకోవాలనే కల కలగానే మిగిలిపోతోంది. ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు అమాంతంగా పెరిగిపోవడమే అందుకు కారణం. సిమెంటు ధరలు, కడ్డీలు (ఐరన్), ఇటుకలు, ఇసుక, కంకర ధరలు గత ఏడాది కంటే 30 శాతం పైగా పెరిగాయి. దీనికి తోడుగా బేల్దారితో పాటు కూలీల కూలీల వేతనాలు కూడా భారీగా పెరిగాయి. ఈ నేపథ్యంలో పేద మధ్య తరగతి ప్రజలకు ఇంటి నిర్మాణం తలకు మించిన భారంగా మారింది. దీంతో నిర్మాణంలో ఉన్న ఇళ్లు కూడా అర్థాంతరంగా ఆగిపోతున్నాయి. పేదల సొంతింటి కలను నిజం చేస్తామని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం ధరలు నియంత్రణ చేయలేక పోయింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా నిర్మాణ మెటీరియల్ ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దీంతో కొత్త ఇల్లు కట్టుకోవాలనుకునే సామాన్య, మధ్యతరగతి ప్రజలు పెరిగిన భారాలను చూసి ఇళ్ల నిర్మాణాలను వాయిదా వేసుకుంటున్నారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

ముడి సరుకులను అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం సిమెంట్ ధర దడ పుట్టిస్తుండగా, ఇటుక ధర బరువెక్కింది. స్టీల్ ధరలకు తోడు ఇతర ధరలు కూడా పెరగడంతో ఇల్లు కట్టాలంటేనే మధ్యతరగతి ప్రజలు జంకుతున్నారు. ధరలపై అధికారుల నియంత్రణ కొరవడటంతో ప్రజలు ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. మెటీరియల్ ధరలు దిగివచ్చాక ఇల్లు కట్టుకుందామనే ఆలోచనతో ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి చాలామంది వేసవి కాలంలోనే ఇళ్ల నిర్మాణాలను ప్రారంభిస్తారు. సరిగ్గా ఈ సీజన్ ప్రారంభమయ్యేసరికి నిర్మాణ సామగ్రి ధరలు ఆకాశాన్నంటాయి. దీంతో వారి అంచనాకు పెరిగిన ధరలతో చూస్తే ఒకవంతు నిర్మాణ భారం పెరిగిపోయిందని నిర్మాణదారులు తలల పట్టుకుంటున్నారు.

నిలిచిన ప్రభుత్వ పక్కా ఇళ్ల పథకం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం పక్కా ఇళ్ల పథకాన్ని పక్కన పెట్టింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ఇళ్లు ఆగిపోగా కొత్త ఇళ్లు మంజూరు మాట మరచిపోయింది. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరు చేసి నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు కూడా బిల్లులు చెల్లించక పోవడంతో ఆ నిర్మాణాలు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయి.

వ్యాపారం కుదేలయింది



మేము చాలా కాలంగా సిమెంటుతో పాటు కడ్డీలు ఇంటి నిర్మాణాలకు సంబంధించిన సామగ్రిని విక్రయిస్తున్నాం. సిమెంటు బస్తాపైన రూ.50 పైగా కడ్డీలు టన్నుపై సుమారు పదివేల వరకూ ధరలు పెరిగాయి. దీనికి తోడు కూలీల భారం కూడా అధికంగా ఉండడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయి. పలితంగా వ్యాపారాలు జరగడంలేదు.

– మణ్యం వెంకటసుబ్బారెడ్డి. వ్యాపారి, బద్వేలు

'స్పందన' కృషితోనే ఎస్‌సీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఏర్పాటు

మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రొద్దుటూరు : స్పందన సుబ్బరామిరెడ్డి చొరవతోనే పట్టణంలో శెట్టిపల్లె చిన్ననాగిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని మైదుకూరు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. స్పందన సుబ్బరామిరెడ్డి సంస్మరణ సభను ఆదివారం సాయంత్రం వైఎంఆర్ కాలనీలోని అరబిందో స్కూల్‌లో ఏర్పాటు చేశారు. స్పందన సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి మాట్లాడుతూ సుబ్బరామిరెడ్డి 60 ఏళ్లుగా ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. 1965లో ఆయన కడప ప్రభుత్వ కళాశాలలో డిగ్రీ చదువుకున్నారన్నారు. ప్రొద్దుటూరులో డిగ్రీ కళాశాల అవసరాన్ని గుర్తించిన ఆయన తన తండ్రి చిన్న నాగిరెడ్డిని డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని కోరారని తెలిపారు. ఆ మేరకు డిగ్రీ కళాశాలకు తాము స్థలాన్ని ఇవ్వడం, ఆయన కోరిక మేరకు కళాశాల ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. కేసీ కెనాల్ ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన సుబ్బరామిరెడ్డి రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని, కరువు సమస్యలపై ఉద్యమించారని కొనియాడారు.

సుబ్బరామిరెడ్డి మితభాషి

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ చెట్టు ఒక పుత్రుడితో సమానమని భావించిన ఆయన విస్తారంగా మొక్కలను నాటించారన్నారు. మిత్రుడు, మితభాషి అయిన స్పందన సుబ్బరామిరెడ్డి ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఆయన కుమారుడు స్పందన రాంప్రసాద్‌రెడ్డికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పట్టణ వ్యాపార సమాఖ్య అధ్యక్షుడు వంకదారి వీరభద్రయ్య, రెడ్ల కల్యాణ మండపం నిర్వాహకులు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, అవధాని నరాల రామారెడ్డి, ప్రముఖ న్యాయవాది ఈవీ సుధాకర్‌రెడ్డి, డాక్టర్ ప్రమీల రంగారెడ్డి స్పందన సుబ్బరామిరెడ్డి సేవలను కొనియాడారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేఎంఆర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ త్రివిక్రమ్ రెడ్డి, డాక్టర్ వైవీ రామమునిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అన్నవరం రామమోహన్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనరసయ్య, చిప్పటిరి ప్రసాద్, టంగుటూరు మారుతిప్రసాద్, సాధు గోపాలకృష్ణ, గజ్జల వెంకటేశ్వర్లురెడ్డి, సుబ్బరామిరెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సారూ.. న్యాయం చేయండి



ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న గ్రామస్తులు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామ పొలంలోని సర్వే నంబర్ 547 లోని 51 సెంట్ల ప్రభుత్వ భూమిని సుమారు వంద సంవత్సరాలుగా గ్రామ అవసరాల నిమిత్తం శ్మశానానికి కేటాయించారు. ఈ భూమిని కొంత మంది గుత్తేదారులు చేతివాటం ప్రదర్శించి అదే గ్రామానికి చెందిన మూలమద్దిరెడ్డి, మూలగురివిరెడ్డి, మూలప్రతాప్‌రెడ్డి, మూలఈశ్వర్‌రెడ్డి అధికారులతో కుమ్మక్కై దొడ్డిదారిన ఒక్కొక్కరి పేర పది సెంట్లు చొప్పున ఆన్‌లైన్ చేయించుకుని ఆక్రమించుకున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయమై గత సోమవారం ఆర్డీఓ కార్యాలయం, తహసీల్దారు కార్యాలయంలో అర్జీలు కూడా ఇచ్చామని, కానీ స్థానిక తహసీల్దారు నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి అందులో గుడిసెలు, ఇతరత్రా ఉన్నట్లు ఆర్డీఓకు నివేదికలు పంపడం సరికాదన్నారు. ఆ భూమిలో ఎటువంటి నిర్మాణాలు, గుడిసెలు లేవని, ఆక్రమణదారులకు వత్తాసు పలుకుతున్నారే తప్ప ఎలాంటి నిర్మాణాలు అక్కడ లేవని వారు తెలిపారు. అంతేకాకుండా తహసీల్దారు గాని ఉన్నతాధికారులు గాని గ్రామంలోకి వచ్చి పరిశీలించి గ్రామస్తులను విచారించి తగు న్యాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాలు



మాట్లాడుతున్న నాగేష్

బద్వేలు అర్బన్ : కార్మికులను బానిసలుగా చేసే చట్టాలను తీసుకొస్తున్న ఎన్డీయే ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్ళు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, దీని వలన కార్మికుల జీవితాలు రోడ్డున పడే అవకాశం ఉందని అన్నారు. మే 1వ తేదీన జరగనున్న మేడే కార్యక్రమంలో కార్మికులంతా భాగస్వాములై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ నాయకులు నరసింహులు, శ్రీనివాసరాజు, వెంకటరెడ్డి, ప్రసాద్, శ్రీనివాసులు, బాబీ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

పోరుమామిళ్ల: వేసవి సెలవులకు స్వగ్రామాలకు వెళ్లేవారు జాగ్రత్తలు పాటించాలని ఎస్ఐ కొండారెడ్డి సూచించారు. ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. దొంగతనాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదివారం ఎస్ఐ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంట్లో ఎవరూ లేకుండా వెళ్లిపోతే సొమ్మును జాగ్రత్త చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ రోజుల కంటే ఇలాంటి సందర్భాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతాయని తెలిపారు. దొంగలు నిఘా పెట్టి నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్తారని హెచ్చరించారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఆకట్టుకున్న చౌడేశ్వరి నాటక ప్రదర్శన



దివ్యజ్ఞానానంద గిరి స్వామిని సత్కరిస్తున్న తొగటవీరక్షత్రియులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ కళా సంస్థ దశమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తొగటవీరక్షత్రియ కుల గురువు దివ్యజ్ఞానానంద గిరి స్వామి మాట్లాడుతూ శ్రీనందవరం చౌడేశ్వరి దేవి అమ్మవారి జీవిత చరిత్రను శ్రీచౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ వారు నాటకంగా ప్రదర్శించడం అభినందనీయమన్నారు. కళా సంస్థ వ్యవస్థాపకుడు కంభం పాములేటి మాట్లాడుతూ చౌడేశ్వరి అమ్మవారి గొప్పతనాన్ని తెలిపేందుకు తొలి సారిగా రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కళాకారులతో ఈ నాటకాన్ని ప్రదర్శించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దివ్యజ్ఞానానంద గిరి స్వామిని సత్కరించారు. తొగటవీరక్షత్రి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీరాంజనేయ ప్రసాద్, శ్రీలత, పల్లా శేషయ్య, బండారు రఘురామయ్య, బండారు సూర్యనారాయణ పాల్గొన్నారు.

పతనమైన ధర.. పట్టని మొర



వరిపంటను హార్వెస్టర్ సాయంతో నూర్పడి చేస్తున్న దృశ్యం



పొలాల్లో వరిధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు



గోదాంలో నిల్వ చేసేందుకు ట్రాక్టర్లలో వరిధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు

అష్టకష్టాలు పడి పంట పండించారు.. చివరికి అమ్ముకోవడానికి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. దిగుబడి తగ్గిన నేపథ్యంలో కనీసం మద్దతు ధరకైనా ధాన్యం అమ్ముకుందామంటే ధర కూడా తగ్గిపోవడంతో ధాన్యపు రైతు దిగులు చెందుతున్నాడు. ఇదే అదునుగా కమీషన్ వ్యాపారులు చెప్పిందే రేటుగా మారింది. వాళ్లు చెప్పినదే ధరగా ఉంటుంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో కుందూనది, కేసీ చాపాడు, కేసీ ప్రధాన కాలవల కింద రైతులు వరి పంటను సాగు చేశారు. నూర్పిళ్ల అనంతరం రబీలో కూడా తిరిగి వరిపంటను సాగు చేశారు. తెగుళ్లు, చీడపీడలు అధికమవడంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి పంటను ఎలాగోలా కాపాడుకుంటూ వచ్చారు. తీరా పంట నూర్పిళ్లు చేశాక ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి పంటసాగు చేసిన కర్షకులు చేసేదేమిలేక ఉన్న ధరలకే అమ్ముకోవడంతో నష్టాల పాలవుతున్నామని వాపోతున్నారు. ఎకరాకు 24 నుంచి 30 బస్తాలు దిగుబడి రాగా, ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల రూపాయలు ఖర్చు అవుతోందని, ప్రస్తుతం ధరలు లేకపోవడంతో నష్టం వస్తోందని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి వరి ధాన్యానికి గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

– రాజుపాళెం

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం



జ్ఞాపికలతో వివిధ మహిళా సంఘాల ప్రతినిధులు

ప్రొద్దుటూరు క్రైం : నైతిక విలువలు పెంపొందించడంతోనే మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యమని జామాతే ఇస్లామి హింద్ మహిళా వింగ్ బాధ్యులు హసీనా, రెహానా, ఆయిషాలు తెలిపారు. స్థానిక కేహెచ్ఎం వీధిలోని జామాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో ఆదివారం ఆ సంస్థ మహిళా వింగ్ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మహిళా సంఘాల నేతలతో మాట్లాడుతూ నేటి సమాజంలో యువత వివాహాలు అయిన వెంటనే తల్లిదండ్రులను దూరం పెడుతున్నారని చెప్పారు. ఇది కుటుంబ వ్యవస్థ పతనానికి దారి తీస్తుందని అన్నారు. ఈ దేశ గడ్డపై హిందూ ముస్లింలు కలిసి మెలసి ఐక్యంగా జీవిస్తున్నారన్నారు. ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. లౌకిక భారతదేశంను మత దేశంగా మార్చాలని కొన్ని శక్తులు చేస్తున్న పన్నాగాలను ఐకమత్యంతో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అతిథులుగా ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఉషారాణి, విరసం కార్యదర్శి వరలక్ష్మి, ఆర్ఎంఎస్ కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, సీఎంఎస్ జిల్లా కన్వీనర్ పద్మ, సభ్యులు చంద్ర, మల్లేశ్వరి, ఆర్‌వీఎస్ కన్వీనర్ హరిత, డాక్టర్ సుజాత, రుక్సానాలు పాల్గొన్నారు. వీరిని నిర్వాహకులు శాలువలతో సన్మానించి, జ్ఞాపికలను అందచేశారు.

వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు న్యాయం

ప్రొద్దుటూరు : కేంద్ర ప్రభుత్వం చేసిన వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు న్యాయం జరుగుతుందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే, వక్ఫ్ సవరణ చట్టం అవగాహన కమిటీ రీజనల్ కన్వీనర్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఆదివారం వక్ఫ్ చట్ట సవరణపై అవగాహన కార్యక్రమం వక్ఫ్ చట్టం అవగాహన కమిటీ జిల్లా కన్వీనర్ అరకటవేముల హరినారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ చట్టం ద్వారా పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందే తప్ప ఎలాంటి నష్టం జరగదని తెలిపారు.

కూటమి ప్రభుత్వం కొత్త కుట్ర

చాపాడు : కూటమి ప్రభుత్వం కొత్త డ్రామా ఆడుతోందని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మాట్లాడారు. మద్యం కుంభకోణం కేసులో ఎస్పీవై డిస్టలరీస్ అధినేత సజ్జల శ్రీధర్‌రెడ్డితో మద్యం కుంభకోణం అంతా వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జరిగినట్లు సిట్‌తో చిలుక పలుకులు పలికించడం తగదని పేర్కొన్నారు. దానిని నిజమని రాష్ట్ర ప్రజల్ని నమ్మించేందుకు కొత్త పలుకు పేరుతో ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ రాయడం దారుణమన్నారు.

స్పోర్ట్స్ కోటాలో రిజర్వేషన్ కల్పించాలి

ప్రొద్దుటూరు : ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటాలో విద్యార్థులకు రిజర్వేషన్ కల్పించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జగన్ కోరారు. ట్రిపుల్ ఐటీ ప్రవేశాలకు ఈనెల 25న నోటిఫికేషన్ విడుదల చేశారని, అందులో మే 28 నుంచి 31వ తేదీ వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో పీహెచ్‌సీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, భారత్ స్కౌట్స్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నారని తెలిపారు. 74 జీఓ ప్రకారం ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటా కింద 2 శాతం రిజర్వేషన్ అమలు చేయని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష

ప్రొద్దుటూరు కల్చరల్ : పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం ఈ నెల 30న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్ బాబు ఆదివారం తెలిపారు. 4,135 మంది పాలిసెట్ పరీక్ష రాయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, వైస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, కామిశెట్టి సుబ్బారావు డిగ్రీ కళాశాల, మండలంలోని లింగాపురం వద్ద ఉన్న శ్రీసాయిరాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీ, చాపాడు మండలం పల్లవోలు వద్ద ఉన్న చైతన్య భారతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కాలేజీలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు 30 నిమిషాల ముందు హాజరు కావాలని సూచించారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ క్యాలిక్యులేటర్, మొబైల్స్ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరని తెలిపారు.

ఉగ్ర దాడి అమానుషం



పోరుమామిళ్లలో మానవహారంగా ఏర్పడిన నాయకులు

పోరుమామిళ్ల: పర్యాటకులపై అత్యంత పాశవికంగా ఉగ్రవాదులు దాడి చేయడం అమానుషమని ప్రగతి స్వచ్ఛంధ సంస్థ తెలిపారు. ఆదివారం పోరుమామిళ్లలో ప్రగతి స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సర్కిల్‌లో మానవహారం నిర్మించి మృతులకు నివాళి అర్పిస్తూ, మౌనం పాటించారు. ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు రాజీవ్‌బాషా, ప్రగతి సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులు, ఆప్కాబ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, సర్పంచులు సుధాకర్, రవిప్రకాష్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, సీపీఐ మస్తాన్, మానవ హక్కుల సంఘం నేత గంగన్న, వివేకానంద పౌండేషన్ రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెరువా .. డంపింగ్‌యార్డా?





పట్టణంలోని కొంతమంది ప్రజలు, వ్యాపారులు, భవన నిర్మాణ దారుల నిర్లక్ష్యం వలన పోరుమామిళ్ల బైపాస్‌రోడ్‌డ్క ఇరువైపులా ఉన్న నాగుల చెరువు డంపింగ్‌యార్డును తలపిస్తోంది. రోడ్డుకు ఇరువైపులా చెత్త, వ్యర్థాలు, భవన నిర్మాణాల శిథిల వ్యర్థాలు, జంతు కళేబరాలతో నిండిపోయి కంపుకొడుతోంది. అలాగే చెరువులోకి కూడా పెద్ద ఎత్తున వ్యర్థాలు చేరాయి. దీంతో బైపాస్‌రోడ్డులో ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్‌కు వెళ్లే పాదచారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వ్యర్థాలు వేస్తుండటంతో చెరువు కలుషితమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చెరువులో వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– బద్వేలు అర్బన్

పూలే అవార్డు ప్రదానం

కాశినాయన : ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్. నారాయణరెడ్డి ఆదివారం రాజమండ్రిలోని ఆనం ప్రేమకుమార్‌రెడ్డి ఫంక్షన్ హాలులో అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సరోజిని వెంకటేశ్వర్లు చేతులమీదుగా జ్యోతిరావుపూలే జాతీయ ఐకాన్ అవార్డు అందుకున్నారు.ఆమె మాట్లాడుతూ ఆకలిగొన్న వారికి అన్నం పెడుతూ ఎన్నో కార్యక్రమాలు చేస్తున్న బి.ఎస్.నారాయణరెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఈ రోజు గొప్ప మహానుభావుని పేరు మీద అవార్డు అందించడం సంతోషంగా ఉందన్నారు. అవార్డుకు తనను ఎంపిక చేసినందుకు ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న బి.ఎస్.నారాయణరెడ్డి